తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం-11- జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 224 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# గుండె జబ్బుల నివారణను మిషన్‌గా తీసుకెళ్లాలి

- విద్యార్థులకు సీపీఆర్ శిక్షణ ఇస్తే వేల ప్రాణాలు కాపాడవచ్చు
- సామాజిక వైద్యుడిగా ప్రజల సమస్యలకు చికిత్స చేస్తున్నాం
- ఫెలోస్ ఇండియా సదస్సు–2026లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

గుండె సంబంధిత వ్యాధులను నివారించాలన్న లక్ష్యంతో సమాజమంతా కలిసికట్టుగా ఒక మిషన్‌లా పనిచేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్డియాలజిస్టులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విద్యార్థులకు సీపీఆర్ శిక్షణ అందిస్తే దేశవ్యాప్తంగా అనేక ప్రాణాలను కాపాడగలమని ఆయన అభిప్రాయపడ్డారు.
ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరుగుతున్న ఫెలోస్ ఇండియా సదస్సు-2026లో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు దక్షిణాసియా దేశాల నుంచి దాదాపు 500 మంది కార్డియాలజిస్టులు మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో పాల్గొంటున్నారని తెలిపారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తాను వృత్తి పరంగా డాక్టర్ కాకపోయినా, నిర్వహిస్తున్న పదవీ బాధ్యతల పరంగా సామాజిక వైద్యుడి

మిగతా 2లో



## సంక్రాంతికి ఊరెళ్తున్నారా? అప్రమత్తంగా ఉండండి

- పండుగ వేళ ఇళ్ల భద్రతపై పోలీసుల హెచ్చరిక
- నిర్లక్ష్యం వద్దు – ముందస్తు జాగ్రత్తే రక్షణ

**హైదరాబాద్, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):** సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లే వారు ఇంటి భద్రత విషయంలో ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు సూచించారు. పండుగ వేళ తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని దొంగలు కాపుకాస్తారని వి.సి. సజ్జనార్ హెచ్చరించారు. ప్రయాణానికి ముందు ఇంటిని సురక్షితంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. నగదు, బంగారు ఆభరణాలను ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచాలని సూచించారు.

8లో

# గౌరవెల్లి ప్రాజెక్ట్ కుడి కాలువపై మంత్రి క్షేత్రస్థాయి పరిశీలన



- 16.5 కిలోమీటర్ల మేర కాలువ వెంట ప్రయాణించి సమస్యల గుర్తింపు
- మరమత్తులు, వంతెనల నిర్మాణంపై అధికారులకు సూచనలు
- మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట పరిధిలో ఉన్న గౌరవెల్లి ప్రాజెక్ట్ కుడి కాలువను మంత్రి పొన్నం ప్రభాకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గౌరవెల్లి నుంచి మల్లారం వరకు సుమారు 16.5 కిలోమీటర్ల మేర ద్విచక్ర వాహనంపై

మిగతా 2లో




## కేంద్ర బడ్జెట్–2026–27పై ముందస్తు సంప్రదింపుల సమావేశంలో భట్టి విక్రమార్క

- రాష్ట్రాల అవసరాలు బడ్జెట్‌లో ప్రతిబింబించాలన్న తెలంగాణ డిప్యూటీ సీఎం
- న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి అధ్యక్షతన సమావేశం
- సమాఖ్య భావనకు బలం చేకూర్చే ప్రయత్నం

2లో



## నమ్మకానికి ప్రతిఫలంగా అభివృద్ధి బాట

- పాలేరు నియోజకవర్గంలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం
- సంక్షేమం–అభివృద్ధితో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం
- బమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**పాలేరు, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):** రెండేళ్ల క్రితం ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని గుండెల్లో పెట్టుకుని పాలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమాల్లో ఆదర్శంగా నిలబెడతానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.

8లో

## తెలంగాణను ప్రపంచ ఆవిష్కరణ రాజధానిగా తీర్చిదిద్దాలి



- కృత్రిమ మేధ, పరిశోధన ఆధారిత ఆవిష్కరణలతో ముందడుగు
- సాంకేతికత సమాజ సేవకు ఉపయోగపడాలి
- బిట్స్ పిలానీ–హైదరాబాద్ ప్రాంగణంలో గ్లోబల్ అలుమ్ని సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు

2లో

## ఊరికెళ్తున్నారా.. జర ఇల్లు భద్రం

- సంక్రాంతి–మేడారం జాతర నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు
- చోరీల నివారణపై కరపత్రాలు విడుదల చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన




**వరంగల్, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు, అలాగే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు తరలివెళ్లే వారి ఇళ్లలో చోరీలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. ఈ మేరకు చోరీల నివారణపై సీసీఎస్ పోలీసులు రూపొందించిన అవగాహన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. పండుగలు,

మిగతా 2లో



## మహిళా అధికారుల గౌరవంపై దుష్ప్రచారం తగదు

- మీడియాలో వచ్చిన కథనాలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం
- వాస్తవాలతోనే వార్తలు రాయాలి
- కుటుంబాలను ఇబ్బంది పెట్టొద్దు

**హైదరాబాద్, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళా ఐఏఎస్ అధికారుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా మీడియాలో వచ్చిన కథనాలపై తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఓ మహిళా ఐఏఎస్ అధికారిపై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

8లో

# మున్సిపల్ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేస్తున్నాం

- పట్టణ ప్రజలు కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెబుతారు: కేటీఆర్
- రెండు ఏళ్లుగా పట్టణాలకు నిధుల్లేవు – అభివృద్ధి శూన్యం
- ఖమ్మం, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల నేతలతో సన్నాహక సమావేశం



**హైదరాబాద్, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

రానున్న మున్సిపల్ ఎన్నికలకు పార్టీని సమర్థంగా సిద్ధం చేసే క్రమంలో భాగంగా, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల పార్టీ నాయకులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణ ప్రజలు కాంగ్రెస్ పాలనపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెబుతారని కేటీఆర్ స్పష్టం చేశారు. గత రెండు సంవత్సరాలుగా పట్టణాలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. రెండు సంవత్సరాలుగా పట్టణాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వని ఏకైక ప్రభుత్వంగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని విమర్శించారు.

మిగతా 2లో



## గోడ పత్రికలను ఆవిష్కరించిన పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

- హరిహర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల అవతరణ దశాబ్ది ఉత్సవాలు
- సంక్రాంతి సంబరాలకు ఘన ఏర్పాట్లు చేయాలని సూచన
- ప్రజలకు ముందస్తు శుభాకాంక్షలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / అన్నపురెడ్డి-పల్లి, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

అన్నపురెడ్డిపల్లి విద్యావేత్త, హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయ పునర్నిర్మాణ వ్యవస్థాపకులు మారగాని శ్రీనివాసరావు శనివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరిహర ఫౌండేషన్ ఆధ్వర్యంలో

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గుండె జబ్బుల నివారణను మిషన్‌గా తీసుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

పాత్రను పోషిస్తూ సమాజంలోని సమస్యలకు చికిత్స అందించే ప్రయత్నం చేస్తున్నానన్నారు. ఇప్పటికే వైద్య వృత్తిలో విజయవంతంగా కొనసాగుతున్న వారు కూడా తమ నాలెడ్జ్‌ను నిరంతరం అప్‌డేట్ చేసుకోవాలనే తపనతో ఈ తరహా సదస్సుల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. నిరంతర అధ్యయనమే అతిపెద్ద విజయ రహస్యమని, నేర్చుకోవడం ఆపేస్తే కెరీర్ అక్కడితోనే ముగిసినట్టేనని వ్యాఖ్యానించారు.

లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్‌కేర్ అనుబంధ రంగాల్లో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ వేగంగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. చాలా మంది డాక్టర్ కావాలని కలలు కంటారైనా అందరికీ ఆ అవకాశం దక్కదని, డాక్టర్లు సమాజంలో ప్రత్యేక స్థానాన్ని కలిగిన వర్గమని, వారు ప్రాణాలను కాపాడతారని ప్రజలు గాఢంగా విశ్వసిస్తారని గుర్తుచేశారు. అందుకే మనుషుల పట్ల, సమాజం పట్ల వైద్యుల బాధ్యతను ఎప్పటికీ మరిచిపోవద్దని సూచించారు.



ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల ప్రయోజనాల కోసం పాలసీలను మరింత మెరుగుపరచేందుకు వైద్యులతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ దిశగా వైద్యులు తమ సలహాలు, సూచనలతో ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఆధునిక సాంకేతికత ప్రపంచాన్ని వేగంగా మార్చుతున్న తరుణంలో ఆరోగ్య రంగం కూడా హైటెక్‌గా మారుతోందని, టెక్నాలజీ పరంగా అప్‌డేట్ అవుతున్నప్పటికీ మానవీయ స్పర్శను ఎప్పుడూ మర్చిపోవద్దని హితవు పలికారు.

ఇటీవల గుండె సంబంధిత వ్యాధులతో మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో గుండె జబ్బుల నివారణను ఒక ఉద్యమంలా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. విద్యార్థులకు సీపీఆర్ వంటి ప్రాథమిక ప్రాణరక్షణ నైపుణ్యాలు నేర్పితే అత్యవసర పరిస్థితుల్లో అనేక ప్రాణాలను కాపాడగలమని, గుండె వ్యాధులపై అవగాహన పెరిగితే సమాజం మొత్తానికి మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఆరోగ్య సంరక్షణలో నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రపంచ స్థాయిలో ఉత్తమ హెల్త్‌కేర్ అందించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సదస్సులో ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎన్. ప్రతాప్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎ. శరత్ రెడ్డి సహా పలువురు ప్రముఖ కార్డియాలజిస్టులు, వైద్య ప్రతినిధులు పాల్గొన్నారు.




## కేంద్ర బడ్జెట్–2026–27పై ముందస్తు సంప్రదింపుల సమావేశంలో భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):

కేంద్ర బడ్జెట్ -2026-27 రూపకల్పనలో భాగంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో నిర్వహించిన ముందస్తు సంప్రదింపుల సమావేశంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రాల ఆర్థిక అవసరాలు, అభివృద్ధి ప్రాధాన్యాలు కేంద్ర బడ్జెట్‌లో స్పష్టంగా ప్రతిబింబించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, మౌలిక వసతుల విస్తరణ, వ్యవసాయం, సామాజిక సంక్షేమ రంగాలకు తగిన నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.రాష్ట్రాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లు, కేంద్ర-రాష్ట్ర సమన్వయం మరింత బలోపేతం కావాల్సిన అంశాలపై భట్టి విక్రమార్క సమావేశంలో ప్రస్తావించారు. సమాఖ్య భావనకు అనుగుణంగా రాష్ట్రాల అభిప్రాయాలకు కేంద్రం ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

కేంద్ర బడ్జెట్ రూపకల్పనలో ఇలాంటి సంప్రదింపులు ఎంతో కీలకమని, రాష్ట్రాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటే సమగ్ర దేశాభివృద్ధి సాధ్యమవుతుందని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను కేంద్ర ప్రభుత్వానికి స్పష్టంగా తెలియజేసినట్లు ఆయన తెలిపారు.

# తెలంగాణను ప్రపంచ ఆవిష్కరణ రాజధానిగా తీర్చిదిద్దాలి

హైదరాబాద్, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణను ప్రపంచ స్థాయి ఆవిష్కరణల రాజధానిగా అభివృద్ధి చేయాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బిట్స్ పిలానీ-హైదరాబాద్ ప్రాంగణంలో జరిగిన బిట్స్ అలుమ్ని అసోసియేషన్ గ్లోబల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

కృత్రిమ మేధ, పరిశోధన ఆధారిత ఆవిష్కరణలు, సాంకేతికతను నైతికంగా వినియోగించడమే భవిష్యత్ అభివృద్ధికి పునాది అని మంత్రి స్పష్టం చేశారు. సాంకేతిక విద్య డిగ్రీలకే పరిమితం కాకుండా, జాతీయ సేవకు, స్వావలంబన భారత్ లక్ష్యాలకు దోహదపడే విధంగా వాస్తవ జీవితంలో ఉపయోగపడాలని అన్నారు. డిజిటల్ మౌలిక వసతుల్లో దేశానికి ఉన్న బలాన్ని, తెలంగాణలో అమలవుతున్న డేటా మార్పిడి వేదికను ఉదాహరణగా ప్రస్తావించారు.



కృత్రిమ మేధ యుగంలో సమన్వయం, నైతిక విలువలు, సమాచార గోప్యత, ప్రజల విశ్వాసమే దీర్ఘకాల విజయానికి కీలకమని శ్రీధర్ బాబు తెలిపారు. బలమైన వ్యవస్థ నిర్మాణం, వేగవంతమైన నిర్ణయాల ద్వారా మాత్రమే సాంకేతిక ప్రయోజనాలు ప్రజలకు చేరుతాయని అభిప్రాయపడ్డారు. సృజనాత్మకంగా సమస్యలను పరిష్కరించే యువతే రాబోయే కాలాన్ని నడిపిస్తారని అన్నారు.

కృత్రిమ మేధ ప్రయోజనాలు గ్రామీణ ప్రాంతాలకు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లను సాంకేతికత ద్వారా పరిష్కరించాలని పిలుపునిచ్చారు. "తెలంగాణ రైజింగ్" దృక్పథంలో భాగస్వామ్యంతో ముందుకు సాగితే రాష్ట్రం ప్రపంచానికి మార్గదర్శిగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



## గౌరవెల్లి ప్రాజెక్ట్ కుడి కాలువపై మంత్రి క్షేత్రస్థాయి పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణిస్తూ కాలువ నిర్మాణ పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గౌరవెల్లి ప్రాజెక్ట్ కార్యనిర్వాహక ఇంజనీర్ రాములు, ఇతర అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి కాలువ వెంట ప్రయాణించారు. కుడి కాలువ నిర్మాణం పూర్తయినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో అడ్డంకులు, పలు గ్రామాలకు అవసరమైన వంతెనల లేమి వంటి సమస్యలను ఆయన గుర్తించారు. కాలువల వద్ద చేయాల్సిన మరమత్తులు, నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన చెట్లు, పొదలను తొలగించాల్సిన అవసరంపై అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులకు సాగునీరు నిరంతరంగా అందేలా కాలువల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ ద్వారా ఆయకట్టు ప్రాంత రైతులకు పూర్తి స్థాయిలో లాభం చేకూరాలంటే మిగిలిన చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

# ఊరికెళ్తున్నారా.. జర ఇల్లు భద్రం

(మొదటి పేజీ తరువాయి)

జాతరల సమయంలో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారి సంఖ్య పెరుగుతుండటంతో దొంగతనాలకు అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పలు ముఖ్య సూచనలు చేశారు. సెలవుల్లో బయటికి వెళ్లేటప్పుడు భద్రతా అలారాలు, కదలికలను గుర్తించే పరికరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదని, ఇళ్లకు కేంద్రీయ తాళం వ్యవస్థ లేదా డిజిటల్ తాళం అమర్చుకోవాలని సూచించారు. బీరువా తాళాలను ఇంట్లో దాచకుండా వెంట తీసుకెళ్లాలని, తాళం వేసి వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా గ్రామ పోలీస్ అధికారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు.



విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు వంటి వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని లేదా వెంట తీసుకెళ్లాలని, పక్కింటి వారికి లేదా తెలిసిన వారికి ఇచ్చి మోసపోవద్దని సూచించారు. వాహనాలను ఇంటి ఆవరణలోనే నిలిపివేయాలని, ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా గొలుసులతో తాళం వేయాలని చెప్పారు. ఇంటి ముందు గేటుకు తాళం వేయకుండా, ఇంట్లో ఎవరో ఉన్నట్టు కనిపించేలా ఒక గదిలో లైట్ వేసి ఉంచాలని సూచించారు. ఇళ్ల భద్రత కోసం నిల్వ సామర్థ్యం ఉన్న రక్షణ కెమెరాలు అమర్చుకోవాలని, ఆన్‌లైన్ ద్వారా మొబైల్‌లో ఇంటి పరిసరాలను పర్యవేక్షించవచ్చని వివరించారు. సోషల్ మీడియాలో తమ ప్రయాణ వివరాలు, లొకేషన్ అప్డేట్లు పెట్టకూడదని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, క్రైమ్స్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీలు సదయ్య, మధుసూదన్, ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## గోడ పత్రికలను ఆవిష్కరించిన పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించిన గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో జరగనున్న మండల అవతరణ దశాబ్ది ఉత్సవాలు, సంక్రాంతి సంబరాలకు సంబంధించిన గోడ పత్రికలను పిసిసి అధ్యక్షులు ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయ ఉత్సవాలను కొనసాగించడం ఎంతో అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే మండల ప్రజలకు ముందస్తుగా మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, కొమరయ్య, సమన్వయకర్త మచ్చ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. హరిహర ఫౌండేషన్ చేపడుతున్న సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు వారు అభినందనలు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కాలంలో పట్టణాలకు ఇచ్చిన నిధులు, చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లు అడగాలని కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ సవాల్ విసిరారు.

కాంగ్రెస్ పాలనలో పట్టణ పరిపాలన పూర్తిగా పడకేసిందని, పారిశుద్ధ్యం నుంచి ప్రతి అంశంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం కేటాయించిన అభివృద్ధి పనులకు మళ్లీ శిలాఫలకాలు వేయడం తప్ప, ఈ ప్రభుత్వం చేసిన కొత్త పనులు లేవన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన రోడ్లు, మౌలిక వసతులు, కమ్యూనిటీ హాళ్లు, మోడల్ మార్కెట్లకు నిధులు ఆపివేయడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు, ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకాలను తట్టుకొని మంచి ఫలితాలు సాధించామని, అదే స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని హరీష్ రావు పిలుపునిచ్చారు. పురపాలక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పలు అంశాలను ఆయన వివరించారు.

సమావేశంలో పార్టీ తరపున చేయాల్సిన ఏర్పాట్లు, ప్రజల ముందు ఉంచాల్సిన అంశాలపై కేటీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. రెండు జిల్లాల ప్రతి మున్సిపాలిటీలోని క్షేత్రస్థాయి పరిస్థితులపై క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వంపై క్షేత్రస్థాయిలో తీవ్ర వ్యతిరేకత ఉందని, పార్టీకి అనుకూల వాతావరణం ఉందని జిల్లా నేతలు సీనియర్ నాయకులకు వివరించారు. కలిసికట్టుగా పోరాడి మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని నాయకులు పిలుపునిచ్చారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
ఆదివారం - 11 - జనవరి 2026



# స్మార్ట్ కిడ్జ్ లో అంబరాన్నంటిన సంక్రాంతి సంబురాలు





- పాఠశాల ప్రాంగణాల నిండా ముగ్గుల తోరణాలు.
- ఆకట్టుకున్న బొమ్మల కొలువు
- భోగి మంటలు, తెలుగింటి పిండి వంటలు, సాంప్రదాయ దుస్తులతో సందడే సందడి.
- గాలిపటాలు, చెరుకు గడలు, డు డూ బసవన్నలతో హుషారు.

**ఖమ్మం బ్యూరో, జనవరి 10(తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. భోగి, సంక్రాంతి, కనుమ సంబురాలు పాఠశాలలో హోరెత్తాయి. పాఠశాల ప్రాంగణాల నిండా ముగ్గుల తోరణాలు కనువిందు చేశాయి. విద్యార్థులు భోగి మంటలు వేసి సందడి చేయగా చిన్నారులకు భోగిపండ్ల వేడుక సాంప్రదాయ సిద్ధంగా నిర్వహించారు. బొమ్మల కొలువుతో చిన్నారులు హుషారుగా గడిపారు. హరిదాసులు, డు డూ బసవన్నలతో అలరించారు. సాంప్రదాయ తెలుగింటి పిండి వంటలు తయారు చేసి అందరికీ పంచి ఆత్మీయ ఆనందాన్ని కలుగజేశారు. చీరకట్టు, పంచ కట్టులతో చిన్నారులు సాంప్రదాయ దుస్తుల్లో కలియ తిరుగుతూ హుషారుగా గడిపారు. పంట పొలాలలో రైతన్నలు నిర్వహిస్తున్న ప్రక్రియల సన్నివేశాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చెరుకు గడలు, మామిడి తోరణాలతో పాఠశాల ఆవరణమంతా అలంకరించి సంక్రాంతి సంబురాలను నయనానందకరంగా నిర్వహించారు. తెలుగు జానపద గేయాలకు విద్యార్థులు వేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గాలిపటాలు ఎగరవేస్తూ విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. మూడు రోజుల పెద్ద పండుగ సంక్రాంతి వేడుకలతో విద్యార్థులు మురిసిపోయారు. విద్యార్థుల తల్లులకు, మహిళా ఉపాధ్యాయులకు నిర్వహించిన ముగ్గుల పోటీలలో మహిళలు పలు సామాజిక అంశాలపై వేసిన రంగవల్లులు ఆలోచింపచేసాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి సంబురాలను మూడు రోజులపాటు నిర్వహించుకుంటున్నామున్నారు. భోగి మంటలు అందరి జీవితాలలో నూతన ఉషస్సులను నింపుతున్నాయని , సంక్రాంతి సంబురాలు తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షిస్తున్నాయి అన్నారు . కనుమ పర్వదిన వేడుకలు అన్నదాతల జీవన నేస్తాల స్వాంతనను దశదిశలా చాటి చెప్పుతున్నాయని పేర్కొన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే ఏకైక పర్వదినం సంక్రాంతి అందరి జీవితాలలో కొత్త వెలుగులు నింపుతున్నదని ప్రకృతి పరంగా కాలగమనం దక్షణాయనం నుంచి ఉత్తరాయణం వరకు ప్రయాణిస్తూ సూర్య భగవానుడు మకర రాశిలోకి ప్రవేశించి నూతన కాంతులను అందించే ప్రస్థానం నవ ఉషస్సులను నింపుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింత నిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కొండా గోపి పుట్టినరోజు సందర్భంగా నాగులవంచలో రక్తదాన శిబిరం....





**ఖమ్మం బ్యూరో, జనవరి 10(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో బిజెపి మండల అధ్యక్షులు కొండా గోపి పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. నాగులవంచ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండా గోపి మాట్లాడుతూ శిబిరంలో సుమారు 25 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని తెలిపారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి సంవత్సరం తన పుట్టినరోజు నాడు పేదలకు నిత్యవసర సరుకులు అందిస్తున్నామని, ఈ సంవత్సరం రక్తదాన శిబిరం నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అంబటి శాంతయ్య ( ప్రోగ్రెసివ్ రికగ్నైసేడ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్), సామినేని అప్పారావు, ఆలస్యం రవి, రౌతు అప్పారావు, కొండలరావు, అంబటి సైదేశ్వర రావు, వంకాయలపాటి త్రివేణి, వంకాయలపాటి శివ, సామినేని బాబురావు, అంబటి లచ్చయ్య, కోపూరి నవీన్, కాసాని బుచ్చిబాబు, అన్నపోగు తిరుపతిరావు, అంబేద్కర్ నగర యువకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే బిజెపి నాయకులు కోరిపల్లి శ్రీను, ప్రధాన కార్యదర్శి మంగయ్య, అనగాని రామారావు, సత్యనారాయణ, పామర్తి శ్రీను, సత్తెనపల్లి గోపి తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నాచారంలో విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు





## కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగంపై తీవ్ర ఆగ్రహం

**నాచారం, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంటలో ఉన్న పటేల్ కుంట చెరువుకు సంబంధించిన సివరేజ్ డైవర్షన్ పనుల్లో జరిగిన భారీ అవకతవకలపై విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కోటి 80 లక్షల రూపాయల ప్రజాధనంతో చేపట్టిన కీలక పనులు పూర్తికాకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.పటేల్ కుంట చెరువులోకి మురుగునీరు చేరకుండా అరికట్టేందుకు జిహెచ్ఎంసి ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో సుమారు మూడు సంవత్సరాల క్రితం సివరేజ్ డైవర్షన్ పనులు ప్రారంభించారు. అయితే ఇప్పటివరకు కేవలం 80 శాతం పనులే పూర్తయ్యాయి. మిగిలిన పనులను మధ్యలోనే నిలిపివేయడంతో చెరువులోకి మురుగునీరు యథావిధిగా చేరుతోంది.ఈ విషయమై నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ పలుమార్లు ఇరిగేషన్ అధికారులను పనులు పూర్తి చేయాలని కోరినా, "కాంట్రాక్టర్ రావడం లేదు" అంటూ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.తాజా విచారణలో వెలుగులోకి వచ్చిన నిజం ఏమిటంటే, సరైన డిజైన్, సరైన లెవెల్ లేకుండా పనులు చేపట్టిన కారణంగా అధికారులు బిల్లులు చెల్లించిన తర్వాత కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలి వెళ్లినట్లు విజిలెన్స్ గుర్తించింది. ఇది అధికారుల నిర్లక్ష్యానికి, కాంట్రాక్టర్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా మారింది.ఈ అంశంపై కార్పొరేటర్ జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, ఐఏఎస్ కు, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో శనివారం రోజు విజిలెన్స్ సీఐ అమృత్ రెడ్డి, విజిలెన్స్ ఏఈ రోహిత్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ ఆంజనేయులు, కమురుద్దీన్ తదితరులు సిబ్బందితో కలిసి పటేల్ కుంట చెరువు వద్దకు చేరుకొని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిశీలన అనంతరం ఈ పనులు పూర్తిగా అధికారుల మరియు కాంట్రాక్టర్ తప్పిదం వల్లే ప్రజలకు ఉపయోగం లేకుండా పోయాయని విజిలెన్స్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఈ మొత్తం వ్యవహారంపై జిహెచ్ఎంసి కమిషనర్‌కు పూర్తి స్థాయి నివేదిక అందజేస్తామని వారు తెలిపారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, "ఎవరి మీద వ్యక్తిగత కక్షతో ఫిర్యాదు చేయలేదు. ప్రజాధనంతో చేపట్టిన పనులు సరైన డిజైన్, సరైన లెవెల్‌తో తిరిగి నిర్మించి చెరువులోకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకుంటే నాచారం ప్రాంతంలో దోమల సమస్య పూర్తిగా తొలగిపోతుంది" అని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, విఠల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, మంగోల్ శివకుమార్, చంద్రశేఖర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# లోకవరం గ్రామ వాసికి రూ.2.50 లక్షల వైద్య సహాయం



పొంగులేటి సిఫారసుతో టీజీఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు చేతుల మీదుగా మంజూరు పత్రం.

**సత్తుపల్లి, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):** కల్లూరు మండలం లోకవరం గ్రామానికి చెందిన నున్నా మణి (భర్త: నున్నా కృష్ణయ్య) అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుతో, టీజీఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం రూ.2.50 లక్షల వైద్య సహాయ పత్రాన్ని మంజూరు చేసింది. ఈ సందర్భంగా మంజూరు పత్రాన్ని మువ్వా విజయబాబు బాధితురాలికి అందజేశారు. హైదరాబాద్‌లోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థలో కొనసాగుతున్న చికిత్స విజయవంతంగా పూర్తై, ఆమె త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరాలని ఆకాంక్షించారు. బాధితురాలి పరిస్థితిని తెలుసుకుని వెంటనే స్పందించి వైద్య సహాయం మంజూరు చేయించి, ఆర్థికంగా అండగా నిలిచినందుకు మువ్వా విజయబాబుకు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరియు మువ్వా విజయబాబు అభిమానులు పాల్గొన్నారు.

# నల్ల చట్టాల రద్దు కోరుతూ దేశవ్యాప్త సమ్మె..



## సమ్మె బుక్లెట్లు విడుదల చేసిన మల్లూరు.

**సత్తుపల్లి, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):** వేంసూరు మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయ ప్రాంగణంలో శనివారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ ముద్రించిన సమ్మె బుక్లెట్లను జిల్లా సహాయక కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ ఆవిష్కరించారు. నల్ల చట్టాల రద్దు కోరుతూ దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా మల్లూరు స్పష్టం చేశారు. ఫిబ్రవరి 12న మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లు, విత్తన చట్టం, విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఈ సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

ఈ సమ్మె అంశాలపై సీఐటీయూ రాష్ట్ర సీనియర్ నేత ఎస్.వీరయ్య రూపొందించిన వివరాలు బుక్లెట్‌లో పొందుపరచినట్లు మల్లూరు మీడియాకు తెలిపారు. బుక్లెట్లను కార్మికులకు పంపిణీ చేసి చైతన్యం కల్పించాలని మండల కమిటీ సభ్యులకు సూచించారు. సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పూరేటి సుగుణరావు, నేరెళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమందడి నూతన ఎస్సై జలంధర్ రెడ్డికి ఘన స్వాగతం



**పెద్దమందడి,జనవరి10(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్‌స్పెక్టర్ జలందర్ రెడ్డిని మండల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై జలంధర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. పెద్దమందడి మండలంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా, ప్రజలకు పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకం కలిగేలా సేవలు అందించాలని కోరారు.మండల ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ, అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.దీనికి స్పందించిన ఎస్సై జలంధర్ రెడ్డి ప్రజల సహకారంతో మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి సడలింపులు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ఐ. సత్య రెడ్డి, స్థానిక సర్పంచ్ సూర్య గంగ రవి, మాజీ జడ్పీటీసీ కొమ్ము వెంకటస్వామి, వార్డ్ మెంబర్లు వాకిటి రమేష్, తన్వీర్ అహ్మద్, ముఖ్య నాయకులు ఎస్. రాఘవేంద్ర, నందిమల్ల త్రినాథ్, గట్టు రాజశేఖర్‌తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని నూతన ఎస్సైకి ఘన స్వాగతం పలికారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# జాతీయ ఉపాధ్యాయ సెమినార్‌లో ప్రముఖ కవి కావ్యసుధకు ఘన సన్మానం




**హైదరాబాద్,జనవరి10(తెలంగాణ ముచ్చట్లు):** సికింద్రాబాద్‌లోని అలీ యవర్ జంగ్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిసబిలిటీస్ ప్రాంతీయ కేంద్రంలో రెండు రోజుల జాతీయ ఉపాధ్యాయ సెమినార్ నిర్వహించారు. భారతీయ ఉన్నత విద్య మరియు ఉపాధ్యాయ విద్యలో ఆందోళనలు, సవాళ్లు మరియు ఆవిష్కరణలు అనే అంశంపై జరిగిన ఈ సదస్సు తొలి రోజున ప్రారంభోత్సవ సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. చాణక్య విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వి. సుధాకర్ ప్రారంభోత్సవ సమావేశానికి హాజరై సంస్థ చేపడుతున్న విద్యా కార్యక్రమాలను అభినందించారు. జాతీయ సెమినార్ ప్రారంభోత్సవానికి ప్రముఖ కవి, జర్నలిస్ట్, ఆధ్యాత్మిక సాహితీవేత్త కావ్యసుధ ముఖ్య అతిథిగా పాల్గొని భారతీయ సనాతన సంప్రదాయాలపై విస్తృతంగా ప్రసంగించారు.

సనాతన ధర్మం అనేది శాశ్వతమైన జీవన విధానమని, మానవ జీవితానికి అవసరమైన నైతిక విలువలను బోధిస్తుందని కావ్యసుధ వివరించారు. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, మహాభారతం వంటి గ్రంథాలు సనాతన ధర్మానికి ప్రాథమిక ఆధారాలని, నిజాయితీ, అహింస, దయ, సత్యం వంటి విలువలు మానవ జీవితాన్ని ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాయని పేర్కొన్నారు. ప్రతి జీవిలో దైవత్వాన్ని దర్శిస్తూ సర్వేజనా సుఖినోభవంతు అనే భావనతో జీవించడమే సనాతన ధర్మం యొక్క మౌలిక ఉద్దేశమని స్పష్టం చేశారు.

సమావేశంలో బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, జాతీయ విద్యా విధానం-2020 అమలు, డిజిటలైజేషన్, మారుతున్న అభ్యాసకుల అవసరాల నేపథ్యంలో ఉన్నత విద్య, ఉపాధ్యాయ విద్య కీలక మార్పుల దశలో ఉందన్నారు. వినికిడి లోపం ఉన్న అభ్యాసకులకు సమాన అవకాశాలు కల్పించేందుకు సహాయక సాంకేతికతలు, సమ్మిళిత బోధనా విధానాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అవసరమని తెలిపారు.

డాక్టర్ కే. శ్రీదేవి ప్రసంగిస్తూ, భారతీయ ఉన్నత విద్య దేశ మేధో, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కీలకమని చెప్పారు. ఉపాధ్యాయ విద్య అభ్యాస ఫలితాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని, ప్రపంచీకరణ, సాంకేతిక పురోగతుల నేపథ్యంలో పాఠ్యాంశాలు, బోధనా విధానాల్లో ఆవిష్కరణలు తప్పనిసరిగా మారాయని వివరించారు. జాతీయ విద్యా విధానం-2020, డిజిటల్ అభ్యాస కార్యక్రమాలు 21వ శతాబ్ద అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను రూపాంతరం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా కావ్యసుధను సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, డాక్టర్ కే. శ్రీదేవి, ప్రొఫెసర్ సుధాకర్ శాలువా, పూలతోటి, మెమెంటో, సర్టిఫికెట్‌తో ఘనంగా సత్కరించారు.సెమినార్ రెండవ రోజు డాక్టర్ అంబటి విద్యలో సాంకేతికత, కృత్రిమ మేధస్సు పాత్రపై, డాక్టర్ దుర్గేష్ ఉన్నత విద్యలో సమ్మిళిత విద్య ప్రాధాన్యతపై, డాక్టర్ సుల్తాన్ సింగ్ వినూత్న నిధుల నమూనాలపై, డాక్టర్ కే. శ్రీదేవి ఉన్నత విద్యా ప్రమాణాలపై ప్రసంగించారు.బి. శ్రీనివాసరావు అధ్యక్షతన, డాక్టర్ కే. శ్రీదేవి కన్వీనర్‌గా నిర్వహించిన ఈ జాతీయ ఉపాధ్యాయ సెమినార్ డాక్టర్ కే. శ్రీదేవి వందన సమర్పణతో విజయవంతంగా ముగిసింది.

# సంక్రాంతి క్రీడా ఉత్సవాలకు కానిస్టేబుల్ కుమార్ సహకారం




◆ తాటికొండ గ్రామ యువకులకు క్రికెట్ కిట్ అందజేత

**స్టేషన్ ఘనపూర్, జనవరి10(తెలంగాణ ముచ్చట్లు):** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తాటికొండ పరిసర గ్రామాల్లో నిర్వహించనున్న క్రీడా ఉత్సవాలకు కానిస్టేబుల్ కుమార్ చేసిన సహకారం ప్రశంసలు పొందుతోంది. క్రీడలపై ప్రత్యేక ఆసక్తి కలిగిన ఆయన, యువత అభ్యర్థనకు స్పందించి పదివేల రూపాయల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు.

తాటికొండ, ఫతేపూర్, చిల్పూర్ గ్రామాల్లో జరిగే క్రికెట్ క్రీడా కార్యక్రమాల కోసం అవసరమైన సహకారాన్ని అందించాలన్న ఉద్దేశంతో, గతంలో స్టేషన్ఘన్పూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించిన కానిస్టేబుల్ కుమార్‌ను తాటికొండ గ్రామ యువకులు సంప్రదించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, హనుమకొండలో పదివేల రూపాయల విలువైన క్రికెట్ కిట్, చెస్ కిట్‌ను సమకూర్చారు.

ఈ కార్యక్రమంలో తాటికొండ గ్రామానికి చెందిన మారపాక ఎల్ల స్వామి, అనంతపురం హరిప్రసాద్, మారపాక సందీప్, మారపాక నాగరాజ్ (ఎంఎన్ఆర్), మారపాక శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. క్రీడల ద్వారా యువతలో ఆరోగ్యకరమైన పోటీ, క్రీడా స్ఫూర్తి పెరుగుతుందని కుమార్ పేర్కొన్నారు. క్రీడా సామగ్రి అందజేసినందుకు గ్రామ యువకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.






# సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో వైభవంగా సంక్రాంతి సంబరాలు

**సత్తుపల్లి, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**స్థానిక మండల పరిధిలోని బి. గంగారం గ్రామంలో స్వయంప్రతిపత్తి కలిగిన సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి పండుగను వైభవంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో బీటెక్ అన్ని బ్రాంచీలు, డిప్లొమా, ఎంబీఏ విద్యార్థినీ-విద్యార్థులు, సాయిస్ఫూర్తి సేవా సమితి, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. సంక్రాంతి అనగా సూర్యుడు రాశిలో ప్రవేశించడమని, ఈ పండుగను మూడు రోజుల పాటు జరుపుకుంటారని తెలిపారు. మొదటి రోజు జోగి పండుగగా జోగి మంటలతో ప్రారంభమవుతుందని, రెండో రోజు సంక్రాంతి సందర్భంగా పాలు పొంగించి అరిసెలు, బొబ్బట్లు, జంతికలు, చక్కినాలు, గారెలు, సేమియాపాయసం, పరమాన్నం వంటి వంటకాలు తయారు చేసి, నూతన వస్త్రాలు ధరించి పండుగను ఆనందంగా జరుపుకుంటారని చెప్పారు. మూడవ రోజు కనుమ సందర్భంగా రైతులు తమకు ఎంతో ఉపయోగపడే పశువులను శుభ్రపరచి పూజలు నిర్వహిస్తారని వివరించారు. దక్షిణ భారతదేశంలో ఈ పండుగను ప్రజలు శ్రద్ధాభక్తులతో మూడు రోజుల పాటు జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు.

పండుగలో భాగంగా కళాశాల ప్రాంగణంలో ముగ్గుల (రంగోలి) పోటీలను నిర్వహించారు. రంగురంగుల ముగ్గులతో కళాశాల వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ఈ పోటీల్లో బాలికలతో పాటు బాలురు కూడా ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థినీ-విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులతో కళాశాల ప్రాంగణం సందడి చేసింది.ఈ కార్యక్రమాల నిర్వహణకు రాచమళ్ళ శ్రీదేవి, సిహెచ్ లీలావతి (ట్రస్టీ), కె. వాసవి, జె. రాజకళ, యన్. సుధారాణి, ఎం. రాణి, యం. ప్రతిమ, జి. రాణి, యం.ఎన్.వి. సత్యవేణి, టి. నాగలక్ష్మి, చింతల శైలజలు బాధ్యతలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యాధికులు, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత, రాజ్యసభ సభ్యులు, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా పాల్గొని ఫ్యాకల్టీ సభ్యులకు, విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి, అన్ని విభాగాల అధిపతులు, ట్రైనింగ్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ డీన్ వి. కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బలుసుపాటి సీతారాములు (అసిస్టెంట్ ప్రొఫెసర్), ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థినీ-విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగరేణి విశ్రాంతి కార్మికులకు కనీస పెన్షన్ పది వేల రూపాయలు ఇవ్వాలి



**హన్మకొండ,జనవరి10(తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి విశ్రాంతి కార్మికుల సమావేశం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి కడార్ల ప్రకాశ్ చారి అధ్యక్షత వహించారు. విశ్రాంతి కార్మికులు చాలీచాలని పెన్షన్‌తో జీవనం సాగించాల్సి వస్తోందని, అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్‌గా పది వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు.పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంటులో సింగరేణి విశ్రాంతి కార్మికుల కనీస పెన్షన్ పది వేల రూపాయలకు పెంచాలని, ఆరోగ్య బీమా సౌకర్యాన్ని విస్తరించాలని డిమాండ్ చేసిన విషయాన్ని సమావేశంలో ప్రస్తావించారు. అలాగే ఎమ్మెల్యే కామినేని సాంబశివరావు అసెంబ్లీలో విశ్రాంతి కార్మికుల సమస్యలను లేవనెత్తుతూ కనీస పెన్షన్ పెంపు, తెల్ల రేషన్ కార్డుల జారీ అంశాలపై డిమాండ్ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రధాన కార్యదర్శి చిదరాల సత్యనారాయణ మాట్లాడుతూ, విశ్రాంతి కార్మికుల పెన్షన్ విధానాన్ని వేజ్ బోర్డులో కలపాలని డిమాండ్ చేశారు. సీఎంపీఎఫ్ ఆర్గనైజేషన్ ట్రస్ట్‌లో బోర్డు సభ్యులతో సంప్రదించి, వేజ్ బోర్డులో పెన్షన్ అంశాన్ని చేర్చేందుకు వినతిపత్రం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రస్తుతం పెన్షన్ కోసం కార్మికుల నుంచి ఏడు శాతం, యజమాన్యం నుంచి ఏడు శాతం చొప్పున వసూలు చేస్తున్నారని, ప్రతి టన్నుకు ఇరవై రూపాయల చొప్పున సీఎంపీఎఫ్‌కు జమ చేస్తున్నట్లు వివరించారు.కోల్ ఇండియా పెన్షనర్లతో కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం విశ్రాంతి కార్మికులంతా పట్టుదలతో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ప్రతిపాదనకు హాజరైన యాభై మంది సభ్యులు ఏకగ్రీవంగా అంగీకారం తెలిపారు.ఈ సమావేశంలో నలబాల దామోదర్, రామ్మూర్తి, ప్రభాకర్, జి వెంకటేశ్వర్లు, ఎస్కే అస్సన్, విద్యాసాగర్, కమలాకర్ రావు, కోటా రాజిరెడ్డి, రమేష్ కుమార్, రవీంద్ర గుప్త తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. అనంతరం అధ్యక్షుల కృతజ్ఞతలతో సమావేశం ముగిసింది.





# క్రీడలతో పల్లె నుంచి ప్రపంచ స్థాయి గుర్తింపు సాధ్యం

## ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**పెద్దమందడి,జనవరి10(తెలంగాణ ముచ్చట్లు):**క్రీడల ద్వారా పల్లె స్థాయి నుంచి ప్రపంచ స్థాయి వరకు గుర్తింపు పొందవచ్చని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. యువత, విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు క్రీడలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి రాణించాలని ఆయన సూచించారు.శనివారం పెద్దమందడి మండల కేంద్రంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామ క్రీడాకారుడు స్వర్గీయ పవన్ కుమార్ జ్ఞాపకార్థం నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, గ్రామీణ స్థాయిలో నిర్వహించే ఇలాంటి క్రీడా పోటీలతో యువతలో స్నేహభావం పెంపొందుతుందని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు.క్రికెట్ ఆడుతూ నాగర్‌కర్నూల్‌లోని మైదానంలో కుప్పకూలి మృతి చెందిన క్రీడాకారుడు స్వర్గీయ పవన్ కుమార్ జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ నిర్వాహకులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రశంసించారు. క్రీడల నిర్వహణకు సహకరించిన యువకులు, గ్రామ పెద్దలను కూడా ఆయన అభినందించారు.క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి, జన్మనిచ్చిన గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఆయన స్వయంగా క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగా రవి, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు సత్య రెడ్డి, మణిగిల్ల మాజీ సర్పంచ్ కొండా రవీందర్ రెడ్డి, పెద్దమందడి మాజీ ఉపసర్పంచ్ జావేద్, న్యాయవాది త్రినాథ్, రాఘవేందర్, నరేష్ తదితర నాయకులు, కార్యకర్తలు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# సఫిల్‌గూడలో రైల్వే పెన్షనర్ల సంఘం సమావేశం



**మల్కాజ్గిరి, జనవరి 10 తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి నియోజకవర్గం సఫిల్‌గూడలో రైల్వే పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెల రెండవ శనివారం నిర్వహించే సమావేశం శనివారం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో జెడ్ఆర్‌యూసీసీ (జెడ్ఆర్యుసిసి) సభ్యుడు నూర్‌ను రైల్వే పెన్షనర్లు ఘనంగా సన్మానించారు.

రిటైర్ అయిన 20 ఏళ్ల తర్వాత కూడా ప్రయాణికుల సేవల కోసం నిరంతరం కృషి చేస్తున్న నూర్ సేవలు ప్రశంసనీయమని కె. నారాయణ పేర్కొన్నారు. రైల్వే విద్యుత్ విభాగంలో పనిచేసిన నూర్ రైల్వే అభివృద్ధి, ప్రయాణికుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజనల్ మెకానికల్ ఇంజనీర్‌తో పాటు పలువురు రైల్వే అధికారులు, పెన్షనర్లు పాల్గొని నూర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది.

# సింగరేణి విశ్రాంతి కార్మికులకు కనీస పెన్షన్ పెంచాలి



**సమావేశంలో డిమాండ్**

**హన్మకొండ,జనవరి10(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సింగరేణి విశ్రాంతి కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కడార్ల ప్రకాశ్ చారి అధ్యక్షత వహించారు. విశ్రాంతి కార్మికులు చాలీచాలని పెన్షన్‌తో జీవనం సాగిస్తూ అనారోగ్యాల పాలవుతున్న పరిస్థితి పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కనీసంగా పదివేల రూపాయల పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంటులో సింగరేణి విశ్రాంతి కార్మికులకు కనీస పెన్షన్ పదివేల రూపాయలు ఇవ్వాలని, ఆరోగ్య బీమా పరిమితిని పెంచాలని డిమాండ్ చేసిన విషయాన్ని సభలో గుర్తు చేశారు. అలాగే ఎమ్మెల్యే కామినేని సాంబశివరావు అసెంబ్లీలో విశ్రాంతి కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూ పెన్షన్ పెంపు, తెల్ల రేషన్ కార్డుల జారీ అంశాలపై డిమాండ్ చేశారని తెలిపారు. ఇందుకు ఇరువురికీ సభ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాన కార్యదర్శి చిదరాల సత్యనారాయణ మాట్లాడుతూ, సింగరేణి విశ్రాంతి కార్మికుల పెన్షన్ విధానాన్ని వేజ్ బోర్డులో కలపాలని డిమాండ్ చేశారు. సీఎం పీఎఫ్ ఆర్గనైజేషన్ ట్రస్టులో బోర్డు సభ్యులతో సంప్రదించి వేజ్ బోర్డులో పెన్షన్ అంశాన్ని చేర్చేందుకు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం పెన్షన్ కోసం కార్మికుల నుంచి ఏడు శాతం, యజమాన్యం నుంచి ఏడు శాతం చొప్పున చందా తీసుకుంటున్నారని, ప్రతి టన్నుకు ఇరవై రూపాయల చొప్పున సీఎంపీఎఫ్‌కు జమ చేస్తున్నారని వివరించారు.

కోల్ ఇండియా పెన్షనర్లతో కలిసి సమిష్టిగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పోరాటానికి పట్టుదలతో సిద్ధమవ్వాలని కోరారు. సమావేశానికి హాజరైన యాభై మంది సభ్యులు ఈ ప్రతిపాదనకు సమ్మతి తెలిపారు.ఈ సమావేశంలో నలబాల దామోదర్, రామ్మూర్తి, ప్రభాకర్, జి వెంకటేశ్వర్లు, ఎస్‌కే అన్సన్, విద్యాసాగర్, కమలాకర్ రావు, కోటా రాజిరెడ్డి, రమేష్ కుమార్, రవీంద్ర గుప్త తదితరులు మాట్లాడి తమ సలహాలు సూచనలు అందించారు. చివరగా అధ్యక్షుల కృతజ్ఞతలతో సమావేశం ముగిసింది.

# మీ నమ్మకాన్ని వొమ్ము చేయడం లేదు



- అభివృద్ధి... సంక్షేమంలో ఎక్కడా తగ్గడం లేదు
- పాలేరు నియోజకవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం బ్యూరో, జనవరి 10(తెలంగాణ ముచ్చట్లు):** "రెండేళ్ల క్రితం మీరు ప్రజా ప్రభుత్వం కావాలని నన్ను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.. ఆనాడు మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని గుండెల్లో పెట్టుకుని పాలేరు నియోజకవర్గంలో ఎక్కడా తగ్గకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్నాం'' అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం పాలేరు నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని విద్యానగర్‌లో రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్లు, కల్వర్టు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేటలో రూ. కోటి రెండు లక్షల యాభై వేల వ్యయంతో అంతర్గత సిసి రోడ్లు, బస్ షెల్టర్, జంక్షన్ అభివృద్ధి, కమ్యూనిటీ హాల్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే నడిమితండాలో రూ. 77.10 లక్షలు, గొల్లగూడెంలో రూ. 37.20 లక్షలు, జలగంనగర్‌లో రూ. 29.30 లక్షలు, బారుగూడెంలో రూ. 24.27 లక్షలు, ఆటోనగర్‌లో రూ. 17.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టే సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై నిప్పులు చెరిగారు. గత పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదవాడి కష్టాలను పట్టించుకోలేదని, రేషన్ కార్డులు అడిగితే మొహం చాటేశారని మండిపడ్డారు. పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులే ఇవ్వకుండా దగా చేసిన గత పాలకుల తీరును ఎండగడుతూ.. తమ ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ కార్డులు అందజేయడమే కాకుండా, దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా తెలంగాణలో సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. గతంలో హాస్టళ్లలో పేద పిల్లలకు సరైన తిండి పెట్టలేదని, తమ ప్రభుత్వం వచ్చాక డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను ఏకంగా 200 శాతం పెంచి పేద విద్యార్థులకు అండగా నిలిచామని వివరించారు. సొంత ఇల్లు లేని ప్రతి పేదవాడికి గూడు కల్పించడమే తమ ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. వచ్చే ఏప్రిల్ నెల నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేపడతామని, ఈ ప్రక్రియ దఫాలవారీగా నిరంతరం కొనసాగుతుందని ప్రజలకు హామీ ఇచ్చారు. పేదవారికి ఎల్లవేళలా అండగా ఉండే విధంగానే ఈ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, రాబోయే ఎన్నికల్లోనూ ప్రజల దీవెనలు ఇలాగే కొనసాగాలని కోరారు.





# 15వ బెటాలియన్‌లో ఘనంగా ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్ ముగింపు

- ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరు .
- విజేతలకు బహుమతుల ప్రదానం.

**సత్తుపల్లి, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక మండల పరిధిలోని బి గంగారం గ్రామం 15వ బెటాలియన్‌లో నిర్వహించిన ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్ -2026 ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ యన్. పెద్దబాబు మంత్రి సీతక్కను సాదరంగా స్వాగతించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మంత్రి గారు 100 మీటర్ల పరుగు, టగ్ ఆఫ్ వార్ తదితర క్రీడా పోటీలను ప్రారంభించారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు బహుమతులు అందజేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది ఉద్యోగరీత్యా అనేక ఒత్తిడులను ఎదుర్కొంటారని, ఇలాంటి క్రీడా పోటీలు వారికి మానసిక ఉత్సాహం, శారీరక ఆరోగ్యం కలిగించడంతో పాటు పని ఒత్తిడి నుంచి ఉపశమనాన్ని ఇస్తాయని తెలిపారు. వివిధ కంపెనీల కంటింజెంట్లు నిర్వహించిన కవాతు తనను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నారు. 15వ బెటాలియన్‌కు సంబంధించిన సమస్యలను న్యాయపరంగా పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ, మంత్రి సూచనల మేరకు బెటాలియన్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా కమాండెంట్ యన్. పెద్దబాబు మాట్లాడుతూ, తెలంగాణ స్పెషల్ పోలీస్ అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్ ఆదేశాల మేరకు ఈ ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, మినిస్టీరియల్ స్టాఫ్, ఫోర్త్ క్లాస్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్, ఐపీఎస్ అడిషనల్ కమాండెంట్ ఏ. అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్. శ్రీధరరాజ్, పి. వేణుగోపాల్ రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, మినిస్టీరియల్ స్టాఫ్, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.






# అల్టిట్యూడ్ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

**ఎల్కతుర్తి, జనవరి10 ( తెలంగాణ ముచ్చట్లు):** అల్టిట్యూడ్ పాఠశాలలో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం అంతా పచ్చని తోరణాలు, రంగురంగుల అలంకరణలతో తెలుగుదనం పొలికపోయేలా పండుగ వాతావరణం నెలకొంది.

విద్యార్థులు కొత్త బట్టలు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు పిల్లలకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించగా, విద్యార్థులు కైట్లు తెచ్చుకొని ఆనందంగా ఆటలాడారు.



ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ పుష్కారి కార్తీక్‌రావు మాట్లాడుతూ, తెలుగు సంస్కృతి సంప్రదాయాలను పిల్లలకు తెలియజేయాలనే ఉద్దేశంతో సంక్రాంతి వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సంక్రాంతి పండుగ గొప్పతనం, ఎందుకు జరుపుకుంటారు, ఎలా జరుపుకుంటారు అనే విషయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్, వైస్ ప్రిన్సిపాల్ లింగం మొగిలి, సరిత, ప్రీ ఫైనల్ ఇంచార్జ్ లావణ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఆశా బేగం, సురేష్, మమత, కవిత, గీత, శ్రావణి, స్వప్న, అనూష, శ్వేత, రమ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






# అల్టిట్యూడ్ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

- తెలుగుదనం ఉట్టిపడేలా విశ్వశాంతి విద్యాలయంలో సంక్రాంతి సంబరాలు.
- గంగిరెద్దుల విన్యాసాలు, దాసుల గానం, కోడి పందాలతో పల్లె వాతావరణం.

**సత్తుపల్లి, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):** తెలుగు సంస్కృతి, సంప్రదాయం, కట్టు-బొట్టు, వేషధారణ ఉట్టిపడేలా శనివారం స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా, హుషారుగా నిర్వహించారు. మామిడాకుల తోరణాలు, బంతిపూల దండల అలంకరణలతో విద్యాలయ ప్రాంగణం పల్లె వాతావరణాన్ని తలపించింది. గంగిరెద్దులు, కోడిపుంజులు, హరిదాసులు, సోదిమ్మ తదితర సంప్రదాయ వేషధారణలతో విద్యార్థులు సందడి చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సంక్రాంతి ఆనందాలను వేడుక రూపంలో కనువిందు చేశారు. చిన్నారులకు భోగి పళ్ళు పోసి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. సంక్రాంతి వైభవాన్ని ప్రతిబింబించే పాటలకు సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు నృత్యాలు చేస్తూ హోరెత్తించారు. మూడు రోజుల సంక్రాంతి పండుగలో తొలి రోజు అయిన భోగి ప్రాధాన్యతను తెలియజేస్తూ కోలాట నృత్యాలతో భోగిమంటల చుట్టూ ఉత్సాహంగా నర్తించారు. హరిదాసుల గానం, కోడిపందాల ప్రదర్శనలు, గంగిరెద్దుల విన్యాసాలు, బొమ్మల కొలువు, భోగి పళ్ళు, సంప్రదాయ దుస్తులు ధరించిన చిన్నారులు ఈ వేడుకలో ప్రధాన ఆకర్షణగా నిలిచారు. అనేక సంవత్సరాలుగా హరినామ కీర్తనలతో ఆకట్టుకుంటున్న రమణతో పాటు గంగిరెద్దుల విన్యాసాలు ప్రదర్శించిన కళాకారులను ఈ సందర్భంగా సన్మానించి ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో విశ్వశాంతి యాజమాన్య సభ్యులు పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుల్ల సత్యనారాయణ, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కుషాయిగూడ పాత మార్కెట్‌లో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆకస్మిక తనిఖీలు





**కుషాయిగూడ, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాప్రా సర్కిల్లో కుషాయిగూడ కూరగాయల పాత మార్కెట్‌లో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలకు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, వైస్ చైర్మన్ విఠల్ నాయక్, డైరెక్టర్ పూర్ణ యాదవ్, జేఎంఎస్ కార్తీక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మార్కెట్‌లోని కూరగాయల హోల్‌సేల్, కాంట దుకాణాలు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని కమిటీ సభ్యులు సూచించారు.లైసెన్స్ లేని వ్యాపారులు వెంటనే లైసెన్స్ తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కుషాయిగూడ ప్రధాన రహదారిని ఆక్రమించకుండా వ్యాపారాలు నిర్వహించాలని హెచ్చరించారు.అనంతరం కుషాయిగూడ కూరగాయల పాత మార్కెట్ హోల్‌సేల్ మరియు కాంట వ్యాపార సముదాయాల సంఘం ప్రతినిధులు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్, జేఎంఎస్‌లను ఘనంగా సన్మానించారు. తమ మార్కెట్ TGPIIC స్థలంలో ఉందని, వ్యాపారాలకు అనుకూలంగా ప్రభుత్వం స్థిరమైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వైస్ చైర్మన్ విఠల్ నాయక్ మాట్లాడుతూ, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వారి ద్వారా ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే వ్యాపారులు నాణ్యమైన కూరగాయలను ప్రభుత్వ ధరలకే విక్రయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ కూరగాయల పాత మార్కెట్ కాంట మరియు హోల్‌సేల్ వ్యాపార సముదాయాల కమిటీ ఉపాధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, సెక్రటరీ చేతుర్ల దేవేందర్ గౌడ్‌తో పాటు సభ్యులు గణేష్ ముదిరాజ్, కొరెల్లి రాఘవేందర్ గౌడ్, శీలం తిలక్ యాదవ్, శీలం సన్నీ యాదవ్, దూసరి వెంకటేష్, అక్కమనేని ఆంజనేయులు, రాగిరి సాకేత్ గౌడ్, భీమ్ రాజ్ చారి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని జోహాను అభినందించిన కామారెడ్డి ఎమ్మెల్యే కటిపెల్లి వెంకట రమణ రెడ్డి







**హన్మకొండ,జనవరి10(తెలంగాణ ముచ్చట్లు):** విద్యానగర్ టీవీ టవర్ పరిధిలోని సెయింట్ పీటర్స్ ఎడ్యూ స్కూల్‌కు చెందిన ఏడో తరగతి విద్యార్థిని జోహా అతర్ జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో ప్రథమ బహుమతి సాధించింది. ఉపాధ్యాయురాలు అరుణ కోతపల్లి మార్గదర్శకత్వంలో రూపొందించిన 'స్మార్ట్ డస్ట్ బిన్ మరియు స్మార్ట్ హ్యాండ్ వాషింగ్ సిస్టమ్' నమూనాతో ఆమె ఈ విజయం సాధించింది. ప్రజా ప్రదేశాల్లో సంపూర్ణ పరిశుభ్రతను సాధించడం, సంక్రమణ వ్యాధుల వ్యాప్తిని అరికట్టడం లక్ష్యంగా ఈ నమూనాను రూపొందించినట్లు తెలిపారు.జిల్లా స్థాయిలో తొలి బహుమతి సాధించిన అనంతరం హనుమకొండ జిల్లాను ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్ర స్థాయి విజ్ఞాన ప్రదర్శనకు జోహా అతర్ ఎంపికైంది. ఈ రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ కామారెడ్డిలో నిర్వహించగా, అక్కడ జ్యూరీ సభ్యుల నుంచి ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. అలాగే కామారెడ్డి ఎమ్మెల్యే కటిపెల్లి వెంకట రమణ రెడ్డి కూడా ఈ ప్రాజెక్టును ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, సామాజిక బాధ్యతను పెంపొందించేలా ఈ తరహా ఆవిష్కరణలు ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. జోహా అతర్ సాధించిన ఈ విజయం పాఠశాలకు, జిల్లాకు గర్వకారణంగా నిలిచిందని పేర్కొన్నారు.

# యాదవులు రాజకీయాలతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలి





◆ యాదవ సర్పంచుల సన్మాన మహోత్సవంలో నేతల పిలుపు

**వనపర్తి,జనవరి10(తెలంగాణ ముచ్చట్లు):** యాదవులు రాజకీయాలతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని, ప్రతి యాదవ సర్పంచ్ సీఎం స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో పనిచేయాలని జిల్లా గొర్రెల పెంపకదారుల సహకార సంఘం మాజీ చైర్మన్ పెండెం కురుమూర్తి యాదవ్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాములు యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవులు పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లాలోని 14 మండలాల పరిధిలోని గ్రామపంచాయతీలకు చెందిన యాదవ సర్పంచులు, ఉపసర్పంచులకు ఘనంగా సన్మాన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొత్తకోట మండల కేంద్రానికి సమీపంలోని శ్రీకృష్ణ దేవాలయ ఆవరణలో పండగ వాతావరణంలో నిర్వహించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సర్పంచ్ అనేది గ్రామానికి ప్రథమ పౌరుడని, రాష్ట్రపతి తర్వాత గ్రామస్థాయిలో అన్ని అధికారాలు సర్పంచులకే ఉంటాయని పేర్కొన్నారు.ప్రభుత్వాలు ఏవి ఏర్పడినా యాదవులు అధిక సంఖ్యలో గెలిచి రాజకీయంగా మరింత బలంగా ఎదగాలని సూచించారు. యాదవులు కేవలం ఓటు వేసే యంత్రాలు కాదని, ప్రజాప్రతినిధులుగా గెలిచే ఆయుధాలుగా మారాలని అన్నారు.గతంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో యాదవ జాతి అభివృద్ధికి విశేషంగా కృషి జరిగిందని గుర్తు చేస్తూ, అదే తరహాలో కాంగ్రెస్ పార్టీలోని ప్రజాప్రతినిధులు కూడా యాదవుల అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు.వనపర్తి జిల్లాలో యాదవులు సుమారు 24 శాతం జనాభా ఉన్నారని, ఆ సంఖ్యకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం రావాలని అన్నారు.జిల్లాలోని సర్పంచులు, ఉపసర్పంచులు ఒకే వేదికపై చేరి ఘనంగా సన్మానం చేసుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు. వనపర్తికి చెందిన సామాజిక సేవావేత్త, వాగ్దేవి జూనియర్ కళాశాల యజమాని, ఎస్ఏ బీయూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యాదవులకు భోజన వసతి కల్పించడంతో పాటు సర్పంచులు, ఉపసర్పంచులకు శాలువాలు, డైరీలు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో యాదవ సంఘ నాయకులు, శ్రీకృష్ణ కమిటీ సభ్యులు, జిల్లాలోని 14 మండలాల గ్రామపంచాయతీ సర్పంచులు, ఉపసర్పంచులు, పెద్ద సంఖ్యలో వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# పాత్రికేయ విలువలకు నిలువెత్తు ప్రతీక టీ.కే. లక్ష్మణ రావు




◆ టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు టి. సంతోష్ చక్రవర్తి

**ఖమ్మం బ్యూరో, జనవరి 10(తెలంగాణ ముచ్చట్లు):** జర్నలిస్టుల గౌరవం,హక్కులు ,సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన సీనియర్ పాత్రికేయుడు,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక సభ్యులు టీ.కే. లక్ష్మణ రావు సంస్మరణ సభను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్ - హెచ్ 2843) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.సభ ప్రారంభంలో లక్ష్మణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి, ఆయన ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు టి.సంతోష్ చక్రవర్తి, కార్యదర్శి నానబాల రామకృష్ణలు మాట్లాడుతూ, లక్ష్మణ రావు మృతి జర్నలిస్టు సమాజానికి తీరని లోటని అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన పోరాట పటిమ టిడబ్ల్యూజేఎఫ్‌కు ఎప్పటికీ మార్గదర్శకమని పేర్కొన్నారు.ఉదయం, వార్త, సాక్షి వంటి ప్రధాన పత్రికల్లో పనిచేసిన సీనియర్ పాత్రికేయుడిగా లక్ష్మణ రావు చిన్న-పెద్ద తేడా లేకుండా అందరితో స్నేహంగా మెలిగేవారని వక్తలు గుర్తు చేశారు.తెలుగు భాషపై అపారమైన పట్టు, వృత్తిలో ఎంత ఒత్తిడి ఉన్నా చిరునవ్వుతో వ్యవహరించే వ్యక్తిత్వం ఆయన ప్రత్యేకతలని కొనియాడారు.జర్నలిస్ట్స్ ఫెడరేషన్ స్థాపనలో ఆయన పోషించిన పాత్ర రాబోయే తరం జర్నలిస్టులకు ఆదర్శమని తెలిపారు.ఈ సంతాపసభలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కుంభం రవికుమార్, టీబీజేఏ జిల్లా అధ్యక్షుడు వందనపు సామ్రాట్ గుప్తా, వీడియో గ్రాఫర్స్ జిల్లా అధ్యక్షుడు అమరబోయిన ఉపేందర్, జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్, టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షుడు గంటెల కుమార్,టీబీజేఏ నగర అధ్యక్షుడు ఎలుగోటి వెంకట్, ప్రెస్ క్లబ్ కోశాధికారి కొదుమూరి భద్రయ్య, నగర కార్యవర్గ సభ్యుడు చిన్నంశెట్టి రాంబాబు తదితరులు పాల్గొని టీ.కే. లక్ష్మణ రావుకు ఘనంగా నివాళులర్పించారు.

# చిన్నారులకు పతంగుల పంపిణీ



◆ మల్లాపూర్‌లో భోగి పండుగ సందడి

**మల్లాపూర్, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ పరిధిలోని ఓల్డ్ మల్లాపూర్ సూర్యానగర్ కాలనీ వద్ద భోగి పండుగను పురస్కరించుకుని చిన్నారులకు పతంగుల పంపిణీ కార్యక్రమాన్ని . ఎస్వీ చంద్రయ్య సేవా సమితి ఆధ్వర్యంలో ఫౌండర్ ఎస్వీ కిట్టు కాంగ్రెస్ నాయకులు చిన్నారులకు పతంగులు పంపిణీ చేసి, అనంతరం యువకులతో కలిసి గాలిపటాలు ఎగురవేస్తూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు .ఈ కార్యక్రమంతో ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొనగా, చిన్నారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.సమాజంలో ఐక్యత, సేవా భావనను పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. భోగి పండుగ సందర్భంగా పిల్లలకు ఆనందాన్ని పంచడం ఎంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో , ఫిరోజ్ ఖాన్, యాది రెడ్డి, రాంప్రసాద్, హరిష్, రవీందర్, రాకేష్ తదితరులు పాల్గొని చిన్నారులకు పతంగులు అందజేశారు.భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# సాకేత్ కాలనీలో చారిత్రాత్మక న్యాయ తీర్పు



ఎస్ఆర్‌డబ్ల్యూఏ కార్యదర్శి పదవిలో సురేష్ చంద్ర నటరాజన్ పునరుద్ధరణ

**కాప్రా, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్రా మున్సిపాలిటీ పరిధిలో, జీహెచ్ఎంసీ హద్దుల్లోని సికింద్రాబాద్ ప్రాంతంలో ఉన్న సాకేత్ కాలనీ మరోసారి చరిత్ర సృష్టించింది. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి, అత్యధిక ఆదాయం కలిగిన కాలనిగా పేరొందిన సాకేత్‌లో కీలక న్యాయ తీర్పు వెలువడింది.మెడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కుషాయిగూడలోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కమ్ ఫ్యామిలీ కోర్టు, నవంబర్ 11, 2025న ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పు ప్రస్తుతం సాకేత్ కాలనీలో చర్చనీయాంశంగా మారింది.సాకేత్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్ఆర్‌డబ్ల్యూఏ) తరఫున, తెలంగాణ రాష్ట్ర సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం-2001 (చట్ట సంఖ్య 35/2001) ప్రకారం నమోదు అయిన సంఘం దాఖలు చేసిన ఎస్ఓపీ నం.04/2023లోని la No.609 పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేపట్టింది. సీపీసీ ఆర్డర్ 39 రూల్ 1 & 2తో పాటు సెక్షన్ 151 కింద ఈ పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు కీలక తీర్పును వెల్లడించింది.పిటిషనర్ అసోసియేషన్ సమర్పించిన అఫిడవిట్ మరియు వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, ఎస్ఆర్‌డబ్ల్యూఏ కార్యదర్శిగా సురేష్ చంద్ర నటరాజన్ పదవిని పునరుద్ధరిస్తూ, ఆయన హోదాను కొనసాగించాలని ఆదేశించింది. అయితే, పిటిషన్‌లో కోరిన మిగతా ప్రార్థనలను కోర్టు తిరస్కరించింది.ఈ తీర్పుతో సాకేత్ కాలనీలో న్యాయపరమైన స్పష్టత ఏర్పడిందని, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యకలాపాలకు ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
ఆదివారం - 11 - జనవరి 2026





# జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతాయనే ప్రచారం అవాస్తవం
- జీవో 252లో మార్పులు – ఇండ్ల స్థలాలకు కోర్టు అడ్డంకులు లేని విధానం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం

**హైదరాబాద్ , జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):** జర్నలిజం గౌరవాన్ని నిలబెట్టి వృత్తికి వన్నెతెచ్చే జర్నలిస్టులందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టుల గౌరవాన్ని తగ్గించాలన్నా,చిన్నబుచ్చాలన్నా ప్రభుత్వానికి ఎలాంటి ఉద్దేశం లేదని ఆయన తెలిపారు.జీవో 252పై శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో 14 జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాలు చేసిన విలువైన సూచనలు, విజ్ఞప్తులను పరిశీలించి జీవో 252లో అవసరమైన మార్పులు, చేర్పులు చేస్తామని హామీ ఇచ్చారు.అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతాయనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మంత్రి ఖండించారు.గతంలో జారీ చేసిన సుమారు 23 వేల అక్రిడిటేషన్ కార్డుల కంటే ఈసారి ఎక్కువ సంఖ్యలో కార్డులు మంజూరు చేస్తామని వెల్లడించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు.అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు ఇవ్వాలనే లక్ష్యంతో శాస్త్రీయ అధ్యయనం చేపట్టామని, దేశవ్యాప్తంగా ఉన్న నిబంధనలను పరిశీలించామని తెలిపారు. ఈ ప్రక్రియ కారణంగా కొంత జాప్యం జరిగిందని స్పష్టం చేశారు. మీడియా కార్డు, అక్రిడిటేషన్ కార్డుల మధ్య ఎలాంటి తేడా లేదని, అక్రిడిటేషన్ కార్డుదారులకు లభించే అన్ని ప్రభుత్వ ప్రయోజనాలు మీడియా కార్డుదారులకూ వర్తిస్తాయని మరోసారి స్పష్టం చేశారు. సర్క్యులేషన్ వివరాలు, సంబంధిత డాక్యుమెంట్లు, చార్టెడ్ అకౌంటెంట్ సర్టిఫికేట్లను ఖచ్చితంగా పరిశీలించడం ద్వారా అసలైన పత్రికలు, నిజమైన పాత్రికేయులకు న్యాయం జరుగుతుందని అన్నారు. మండలానికి ఒక విలేకరి ప్రాతిపదిక కాకుండా జనాభా ఆధారంగా అక్రిడిటేషన్లు మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. అక్రిడిటేషన్ కమిటీల్లో ఉర్దూ జర్నలిస్టులకు అవకాశం కల్పిస్తామని, క్రీడలు, సాంస్కృతికం, క్రైమ్, కేబుల్ టీవీ తదితర విభాగాల జర్నలిస్టులకూ అక్రిడిటేషన్ సౌకర్యం ఉంటుందని చెప్పారు. మహిళా జర్నలిస్టుల కోసం ప్రత్యేక కోటా కేటాయిస్తామని హామీ ఇచ్చారు.దేశంలో తొలిసారిగా తెలంగాణలోనే డిజిటల్ మీడియా కార్డులు మంజూరు చేసిన ఘనత రాష్ట్రానిదేనని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, పెన్షన్, బస్‌పాసులు, బీమా వంటి అంశాలపై ప్రతినిధులు చేసిన విజ్ఞప్తులకు మంత్రి సావధానంగా స్పందించారు.

జర్నలిస్టుల ఇండ్ల స్థలాలపై స్పష్టత జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశంపై స్పందించిన మంత్రి, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను ప్రభుత్వం పరిష్కరించి జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీకి భూమి అప్పగించిందన్నారు. అనంతరం సుప్రీం కోర్టు తీర్పుతో సమస్య మళ్లీ తలెత్తినప్పటికీ, జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం సానుకూలంగానే ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తామని వెల్లడించారు.

## శ్రీ గ్లోబల్ హై స్కూల్ నాగులవంచలో

# ఘనంగా సంక్రాంతి సంబరాలు...

**ఖమ్మం బ్యూరో, జనవరి 10(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో ఉన్నటువంటి శ్రీ గ్లోబల్ హైస్కూల్లో సంక్రాంతి పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంతో అలంకరించారు. విద్యార్థులు రంగురంగుల సాంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. సంక్రాంతి ప్రత్యేకతను తెలియజేసే విధంగా భోగిమంటలు ఏర్పాటు చేసి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. బాలికలు సాంప్రదాయ నృత్యాలు, అలంకరణతో పండుగ ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. గ్రామీణ సంస్కృతి ప్రతిబింబించే కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





పాఠశాల ఆవరణాన్ని రంగురంగుల ముగ్గులతో అలంకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో భారతీయ సాంప్రదాయాలపై అవగాహన పెంపొందించడమే ఇలాంటి వేడుకల లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆనందం, ఉత్సాహాన్ని నింపిందని ప్రశంసించారు.

# మధర్ తెరిస్సా టెక్నో స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు.!

- పాఠశాల చిన్నారులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా రాగమయి.

**సత్తుపల్లి, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలోని మధర్ తెరిస్సా టెక్నో స్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు మట్టా రాగమయి పాల్గొని పాఠశాల చిన్నారులతో కలిసి పండుగ వేడుకల్లో సందడి చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు, విద్యార్థులకు ముందస్తుగా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులతో కలిసి బోగి మంటల వద్ద ఆటలు, పాటల కార్యక్రమాల్లో పాల్గొని, చిన్నారులతో కోలాటం ఆడారు. హరిదాస్ వేషధారణలో ఉన్న చిన్నారులను అభినందించి వారి ప్రతిభను ప్రశంసించారు.




ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, నియోజకవర్గంలోని విద్యార్థులు చదువులో ముందుండాలని ఆకాంక్షించారు. సంక్రాంతి సెలవుల్లో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ప్రత్యేకంగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.






# ఆదర్శ పురుషుల పొదుపు సంఘం ద్వారా భీమా సాయం అందజేత

**ఎల్కతుర్తి, జనవరి 10: (తెలంగాణ ముచ్చట్లు) :** ఆదర్శ పురుషుల పొదుపు సంఘం గోపాల్‌పూర్‌లో రెగ్యులర్ సభ్యులుగా కొనసాగుతూ ప్రమాదవశాత్తు మరణించిన సభ్యుల కుటుంబాలకు సంఘం తరఫున భీమా సాయం అందించారు.

సంఘానికి చెందిన సభ్యుడు గండికోట సాంబయ్య ప్రమాదవశాత్తు మృతి చెందగా, ఆయన కుటుంబానికి సామూహిక భీమా క్లబ్-1 కింద రూ.35,000, సామూహిక భీమా క్లెయిమ్-2 కింద రూ.35,000, అభయ నిధి విపత్సాయం కింద రూ.10,000 మొత్తంగా రూ.80,000లను అందజేశారు. అదేవిధంగా, ఆదర్శ పురుషుల పొదుపు సంఘం గోపాల్‌పూర్‌కు చెందిన రెగ్యులర్ మెంబర్ గడ్డం సంపత్ ప్రమాదవశాత్తు మరణించగా, ఆయన నామినీకి రెండు లక్షల రూపాయల ప్రమాద భీమా మొత్తాన్ని సంఘం తరఫున అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు తాటికొండ అభిలాష్ గారు, సమితి అధ్యక్షులు బరిదుల రాజిరెడ్డి గారు, అలాగే సంఘ పాలకవర్గ సభ్యులు పాల్గొని భీమా చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సభ్యుల కుటుంబాలకు ఎల్లప్పుడూ ఆదర్శ పురుషుల పొదుపు సంఘం అండగా ఉంటుందని తెలిపారు.

## మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

# మేఘన్న అభయహస్తం




**మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం**

**పెద్దమందడి,జనవరి10(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన సుర కొండన్న (62) అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందడం జరిగింది.విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు మృతుని నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.పేద కుటుంబాలకు అండగా నిలిచే మేఘన్న అభయహస్తం కార్యక్రమం ద్వారా మృతుని కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.5,000/రూపాయల ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి ధైర్యం చేకూర్చారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులు తమ కష్టకాలంలో స్పందించి ఆర్థిక సహాయం అందేలా చేసిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల కష్టాల్లో భాగస్వాములై, పెద్దమందడి మండలంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూర్య గంగా రవి, వార్డ్ మెంబర్ వాకిటి రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వాకిటి నరేష్, నందిమల్ల కురుమన్న, త్రినాథ్, చిన్న మన్యం, బోయ స్వామి, గట్టు రాజశేఖర్, సుర వెంకటస్వామి, వహీద్ (పాపా), కొత్త సురేష్, గొడుగు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. మృతుని కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని నాయకులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# క్రీడలతో ఐక్యత, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



- పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి

**పెద్దమందడి,జనవరి10(తెలంగాణ ముచ్చట్లు):** క్రీడలు మనుషుల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని పెద్దమందడి ఎస్సై యుగంధర్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని మండలంలోని జగత్‌పల్లి గ్రామంలో జగత్‌పల్లి ప్రీమియర్ లీగ్ పేరిట నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక సర్పంచ్ పెంటన్న యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు.సర్పంచ్ బంతిని విసరగా ఎస్సై బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా ఎస్సై యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి యువత మద్యానికి, మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా నడుచుకోవాలని సూచించారు. పండగలు, ప్రత్యేక రోజుల్లో క్రీడా పోటీలు నిర్వహించడం శుభ పరిణామమని పేర్కొన్నారు.క్రీడల వల్ల ఐక్యతతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెరుగుతాయని తెలిపారు. క్రీడా ప్రాంగణాల్లో స్వాగత ఫ్లెక్సీల కంటే హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, మద్యం సేవించి లేదా ధూమపానం చేసి వాహనాలు నడపవద్దని అవగాహన కల్పించే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. యువత ఉన్నత చదువులు చదివి జీవిత ఆశయాలను సాధించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారు, గ్రామాల్లో గొడవలు సృష్టించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తానని, ఎంతటి పెద్దలతో చెప్పించినా వినే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అనంతరం జగత్‌పల్లి ప్రీమియర్ లీగ్ నిర్వాహకులు ఎస్సై యుగంధర్ రెడ్డి, సర్పంచ్ పెంటన్న యాదవ్‌లతో పాటు గ్రామస్తులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటన్న యాదవ్, మణిగిల్ల సర్పంచ్ పనస శ్రీనివాస్ గౌడ్, గ్రామస్తులు శ్రీనివాస యాదవ్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మన్యంకొండ యాదవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్ నాయుడు, భాస్కర్ యాదవ్, రాజు యాదవ్, రాములు యాదవ్, గౌనికాడి వెంకటేష్ యాదవ్, జానంపేట తిరుపతి నాయుడు, నిర్వాహకులు శివ యాదవ్, ధోని, బాలరాజు, వెంకటేష్ సాగర్, ప్రవీణ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సై జలంధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు నత్తి మన్నెం

**పెద్దమందడి,జనవరి10(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన జలంధర్ రెడ్డిని మద్దిగట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నత్తి మన్నెం శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖతో సమన్వయంగా పని చేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నాయకులు మన్నెం పేర్కొన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొనాలంటే ప్రజలు, పోలీసుల మధ్య సమన్వయం మరింత బలపడాలని అభిప్రాయపడ్డారు.



నూతన ఎస్సై జలంధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల భద్రతే తన ప్రధాన లక్ష్యమని, చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజా ప్రతినిధులు, నాయకుల సహకారంతో మండలంలో శాంతిభద్రతలు మరింత పటిష్టం చేస్తామని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సంక్రాంతికి ఊరెళ్తున్నారా? అప్రమత్తంగా ఉండండి

- పండుగ వేళ ఇళ్ల భద్రతపై పోలీసుల హెచ్చరిక
- నిర్లక్ష్యం వద్దు – ముందస్తు జాగ్రత్తే రక్షణ



**హైదరాబాద్, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**
సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లే వారు ఇంటి భద్రత విషయంలో ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు సూచించారు. పండుగ వేళ తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని దొంగలు కాపుకాస్తారని వి.సి. సజ్జనార్ హెచ్చరించారు. ప్రయాణానికి ముందు ఇంటిని సురక్షితంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. నగదు, బంగారు ఆభరణాలను ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచాలని సూచించారు. అలాగే పండుగకు వెళ్లుతున్నామని తెలిపే వివరాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దని తెలిపారు. అలాంటి సమాచారం దొంగలకు సంకేతంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు.
ఇంటి తాళం వేసి వెళ్లే ముందు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, అవసరమైతే పరిసరాలపై నిఘా పెంచేలా సహకరించాలని కోరారు. ఏదైనా అనుమానాస్పద పరిస్థితి కనిపిస్తే వెంటనే అత్యవసర పోలీసు సేవలను సంప్రదించాలని సూచించారు. ప్రజల భద్రతే పోలీసుల బాధ్యత అని స్పష్టం చేసిన సజ్జనార్, అందరూ పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, జాగ్రత్తే నిజమైన

# నమ్మకానికి ప్రతిఫలంగా అభివృద్ధి బాట



**పాలేరు, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**
రెండేళ్ల క్రితం ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని గుండెల్లో పెట్టుకుని పాలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమాల్లో ఆదర్శంగా నిలబెడతానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.
శనివారం నియోజకవర్గంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, కార్యకర్తలతో కలిసి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఖమ్మం నగర పరిధిలోని విద్యానగర్‌లో రూ. 4 కోట్ల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేటలో రూ. 1 కోటి 2 లక్షల 50 వేల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, బస్సు నిలయము, జంక్షన్ అభివృద్ధి, కమ్యూనిటీ హాల్ ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. నడిమితండాలో రూ. 77.10 లక్షలు, గొల్లగూడెంలో రూ. 37.20 లక్షలు, జలగంనగర్‌లో రూ. 29.30 లక్షలు, బారుగూడెంలో రూ. 24.27 లక్షలు, ఆటోనగర్‌లో రూ. 17.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణాల మధ్య అభివృద్ధి తేడా లేకుండా సమగ్ర ప్రగతే లక్ష్యమని పేర్కొన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కష్టాలను పట్టించుకోలేదని, కనీసం రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఇందిరమ్మ పాలనలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేయడమే కాకుండా, దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. సొంత ఇల్లు లేని పేదలకు గూడు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, వచ్చే ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేపడతామని చెప్పారు. పేదలకు ఎల్లవేళలా అండగా ఉండే ప్రజా ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదాలు రాబోయే ఎన్నికల్లోనూ కొనసాగాలని మంత్రి ఆకాంక్షించారు.

# మహిళా అధికారుల గౌరవంపై దుష్ప్రచారం తగదు

**హైదరాబాద్, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**
మహిళా ఐఏఎస్ అధికారుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా మీడియాలో వచ్చిన కథనాలపై తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఓ మహిళా ఐఏఎస్ అధికారిపై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా కథనాలు రాయడం సరికాదని హితవు పలికారు. నల్గొండ జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో కలెక్టర్ల బదిలీలు జరిగాయని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రక్రియ మంత్రులు, ఎమ్మెల్యేలకు ముందుగా తెలియకుండానే జరిగే సందర్భాలు ఉంటాయని చెప్పారు. అధికారులపై ఆధారంలేని ఆరోపణలు చేయడం సమంజసం కాదని స్పష్టం చేశారు. సంచలనాల కోసం కాకుండా వాస్తవాల ఆధారంగా మాత్రమే వార్తలు రాయాలని మీడియాను కోరారు. చానళ్ల మధ్య పోటీ కోసం అధికారులను, ముఖ్యంగా మహిళా అధికారులను ఇబ్బంది పెట్టడం తగదని ఆయన అన్నారు. కేవలం మంత్రులపైనే కాకుండా ముఖ్యమంత్రిపై కూడా దుష్ప్రచారం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు నిజాలు తెలియజేయడమే మీడియా బాధ్యత అని, గౌరవం, బాధ్యతతో వ్యవహరించాలని ఆయన సూచించారు.



# దావోస్ వేదికగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్

- ప్రపంచ పెట్టుబడిదారులకు క్యూర్–ప్యూర్–రేర్ ప్రణాళికల పరిచయం
- మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యంతో ముందుకు తెలంగాణ
- పెట్టుబడి ఒప్పందాల అమలుపై ముఖ్యమంత్రి సమీక్ష



**దావోస్ / హైదరాబాద్, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**
రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పెట్టుబడులను సాధించడమే లక్ష్యంగా, దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సు-2026 వేదికపై తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ప్రపంచానికి పరిచయం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్దేశించారు. ఈ విజన్‌కు అనుగుణంగా రూపొందించిన క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికలను గ్లోబల్ పెట్టుబడిదారుల ముందు ఉంచాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ముందుకు సాగుతోందని ఆయన పునరుద్ఘాటించారు.
ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గడిచిన రెండేళ్లలో దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా తెలంగాణకు లభించిన పెట్టుబడి హామీలు, ప్రతిపాదనల పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. అలాగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025లో ఆకర్షించిన పెట్టుబడులు ప్రస్తుతం ఏ స్థాయిలో అమలవుతున్నాయన్న అంశాలపై అధికారులతో విస్తృత చర్చ జరిపారు. పెట్టుబడుల భూమి స్థాయి అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.
పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణకు ఇప్పటికే ఉన్న బలాలు, మౌలిక వసతులు, మానవ వనరులను మరింత సమర్థంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మూడు అంచెల ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేలా రూపొందించిన క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికలను తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్ వేదికగా ప్రపంచ దేశాల పెట్టుబడిదారులకు వివరించనుందని తెలిపారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.
"సంభాషణ ఆత్మ" అనే భావనతో జనవరి 19 నుంచి 23 వరకు దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సు-2026ను దృష్టిలో పెట్టుకుని, గతంలో పెట్టుబడిదారులతో చేసుకున్న ఒప్పందాలను పునఃసమీక్షించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అమలులో ఏవైనా సమస్యలు లేదా అడ్డంకులు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ విజన్ పత్రంలో పొందుపరిచిన ఆర్థిక వృద్ధి ప్రణాళికలను ప్రపంచ పెట్టుబడిదారులకు సమర్థంగా చేరవేసేలా ప్రతినిధి బృందం విస్తృత స్థాయి సమావేశాలు, చర్చలు నిర్వహించనుందని వెల్లడించారు.

# మియాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

- మూడు వేల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమి పరిరక్షణ
- సర్వే నంబరు 44లో 15 ఎకరాలకు పైగా భూమి స్వాధీనం
- అక్రమ కబ్జాలపై కఠిన చర్యలు



**మియాపూర్ / రంగారెడ్డి జిల్లా, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**
రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ విలేజ్ మక్తా మహబూబ్ పేటలో హైడ్రా విభాగం భారీ ఆపరేషన్ నిర్వహించింది. సర్వే నంబరు 44లో అక్రమ ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, సుమారు మూడు వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన భూమిని కాపాడింది. ప్రజావాణికి గతంలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.
ఇదే సర్వే నంబరులో ఇప్పటికే ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా గతంలోనే స్వాధీనం చేసుకుంది. మియాపూర్-బాచుపల్లి ప్రధాన రహదారికి సమాంతరంగా ఉన్న చెరువు కట్టపై సుమారు రెండువందల మీటర్ల మేర ఏర్పాటు చేసిన పద్దెనిమిది షెడ్లను కూడా అప్పుడే తొలగించింది. తాజా విచారణలో సర్వే నంబరు 44లో పదిహేను ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి అక్రమ కబ్జాలో ఉన్నట్లు హైడ్రా నిర్ధారించింది.
ఇటీవల ప్రభుత్వ భూములకు సంబంధించిన అక్రమ రిజిస్ట్రేషన్లు, సంబంధిత ఉప రిజిస్ట్రార్‌పై చర్యల నేపథ్యంలో హైడ్రా మరోసారి విస్తృత స్థాయి విచారణ చేపట్టింది. తప్పుడు పత్రాలతో అక్కడి నలభై మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు గుర్తించింది. సర్వే నంబరు 159కు సంబంధించిన భూమి పత్రాలను ఉపయోగించి, సర్వే నంబరు 44లో ఎకరన్నర వరకూ ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై ఇప్పటికే కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.
హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ భూమి ప్రభుత్వానికి చెందిందని స్పష్టంగా తెలియజేస్తూ హైడ్రా బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అక్రమ కబ్జాదారులపై కఠిన చర్యలు కొనసాగుతాయని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు.

# ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్‌లో రూ.2.58 కోట్లు మోసపోయిన మాజీ ఐపీఎస్ అధికారి భార్య

- వాట్సాప్ ట్రేడింగ్ గ్రూప్ పేరుతో సైబర్ నేరగాళ్ల బురిడీ
- నకిలీ సెబి సర్టిఫికెట్లతో నమ్మకం కల్పించిన ముఠా
- హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు



**హైదరాబాద్, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**
స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్మెంట్ పేరుతో సైబర్ నేరగాళ్లు మాజీ ఐపీఎస్ అధికారి భార్యను మోసం చేసి రూ.2.58 కోట్లను కాజేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగుచూసింది. వాట్సాప్ ద్వారా వచ్చిన సందేశాలను నమ్మిన బాధితురాలు భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు పోలీసుల విచారణలో తేలింది.
స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ చిట్కాలు అందిస్తామని వాట్సాప్ ద్వారా వచ్చిన సందేశాల ఆధారంగా, అవగాహన లేక తన భర్తను కూడా సంబంధిత వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేసినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. ఆ గ్రూప్‌లో 500 శాతం లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. ఈ పెట్టుబడి వేదిక సెబి ధృవీకరణ పొందిన వెబ్‌సైట్ అని చెప్పి, నకిలీ సెబి సర్టిఫికెట్లను వాట్సాప్‌లో పంపి విశ్వాసం కల్పించారు.
డిసెంబర్ 24 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు మొత్తం 19 లావాదేవీల ద్వారా రూ.2.58 కోట్లను పెట్టుబడిగా చెల్లింపులు చేయించినట్లు పోలీసులు గుర్తించారు. ఒక దశలో పెట్టుబడులు నిలిపివేయడంతో, మళ్లీ మళ్లీ డబ్బులు పెట్టాలని ఒత్తిడి చేసిన నేరగాళ్లు, ఇన్వెస్ట్ చేయకపోతే ఇప్పటివరకు పెట్టిన మొత్తం అంతా పోతుందని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. తాము మోసపోయామని గ్రహించిన తర్వాత బాధితులు హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ తరహా పెట్టుబడి ఆఫర్లను నమ్మవద్దని, ముఖ్యంగా వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా వచ్చే అధిక లాభాల హామీలు ఎక్కువగా మోసాలేనని పోలీసులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.

# కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం

- హార్వర్డ్ విశ్వవిద్యాలయ ఇండియా సదస్సులో ప్రసంగించనున్న కేటీఆర్
- తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంపై ప్రపంచ వేదికలో చర్చ
- ఫిబ్రవరి 14, 15 తేదీల్లో సదస్సు నిర్వహణ



**హైదరాబాద్, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**
తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా పనిచేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి కేటీఆర్ కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం లభించింది. అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం నిర్వహించనున్న 23వ ఇండియా సదస్సులో ప్రసంగించాల్సిందిగా నిర్వాహకులు కేటీఆర్‌ను ఆహ్వానించారు. "మన ఊహించుకుంటున్న భారత్" అనే భావనతో ఈ సదస్సును ఫిబ్రవరి 14, 15 తేదీల్లో హార్వర్డ్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ వేదికపై తెలంగాణ అభివృద్ధి నమూనా, పరిపాలనలో సాంకేతిక వినియోగం, పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై కేటీఆర్ ప్రసంగించనున్నారు. గతంలోనూ పలు అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ ప్రగతిని వివరించిన కేటీఆర్, ఈ సదస్సు ద్వారా భారత్ భవిష్యత్ దిశ, యువత పాత్ర, ఆవిష్కరణలు, స్థిరమైన అభివృద్ధి వంటి అంశాలపై తన ఆలోచనలను ప్రపంచ మేధావులతో పంచుకోనున్నారు. ఇది తెలంగాణకు మరోసారి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చే అవకాశంగా రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.
ఈ ఇండియా సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా విద్యావేత్తలు, విధాన నిర్ణేతలు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ ప్రతిష్టాత్మక వేదికపై కేటీఆర్‌కు లభించిన ఆహ్వానం తెలంగాణ అభివృద్ధి ప్రయాణానికి ప్రపంచ స్థాయిలో లభించిన గౌరవంగా భావిస్తున్నారు.

# సంక్రాంతికి పల్లె బాట.. ఒక్కసారిగా పెరిగిన వాహనాల రద్దీ



**హైదరాబాద్, జనవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**
సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరవాసులు పల్లెలకు క్యూ కట్టారు. ఏపీకి వెళ్లే వారి వాహనాలతో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి కిక్కిరిసిపోయింది. శనివారంసాయంత్రం ఒక్కసారిగా వాహనాల రద్దీ పెరిగిపోయింది. యాదాద్రి జిల్లా పంతంగి టోల్ ప్లాజా దగ్గర భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పంతంగి టోల్‌ప్లాజా దగ్గర భారీగా వాహనాలు నిలిచిపోయాయి.
ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సర్కిల్ వద్ద వాహనాల రద్దీ పెరిగింది. ట్రాఫిక్ జామ్‌తో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. హైదరాబాద్... విజయవాడ హైవే ఇబ్రహీంపట్నం వద్ద వాహనాలు నిదానంగా కదులుతున్నాయి. ట్రాఫిక్ ఆంక్షలతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేడు, రేపు ట్రాఫిక్ మరింత పెరిగే అవకాశం ఉందని.. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సీఐ చంద్రశేఖర్ అన్నారు.
హైదరాబాద్‌లో పలు చోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సిటీ కాలేజీ, ఎంజే మార్కెట్, బేగంబజార్, హైకోర్టు, అఫ్జల్‌గంజ్, నయాపూల్ భారీగా ట్రాఫిక్ ఏర్పడింది. వీకెండ్ సంక్రాంతి సెలవులు, ఎగ్జిబిషన్ కారణంగా రద్దీ నెలకొంది.
పండిట్ నెహ్రూ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. సంక్రాంతికి సొంత గ్రామాలకు ప్రజలు ప్రయాణమయ్యారు. స్కూళ్లు, కాలేజీలకు సెలవులు కావడంతో రద్దీ పెరిగింది. ఇవాళ ఉదయం నుండి ప్రయాణికులతో బస్టాండ్లు రద్దీగా మారాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in